
ఉత్తమా చిత్ర
మనసు-మాంగల్యం
నిర్మాత
కోగంటి కుటుంబరావు
దర్శకత్వం: కె. ప్రత్యగాత్మ
సంగీతం: పెండ్యాల
రచన: ఆచార్య ఆత్రేయ

కథాసంగ్రహం

తెలంగాణా రజాకార్ల దౌర్జన్యోద్యమం రోజుల్లో వారి దురాగతాలకు బలి అయిన కుటుంబాలలో రవిది కూడా ఒకటి. రవి యువకుడు, సహృదయుడు, కవి. తెలంగాణా విముక్తి పోరాటంలో పాల్గొన్న రవి చిత్రహింసలకు గురిఅయ్యాడు. తెలంగాణా విముక్తి పొందింది గాని, రవి తన వార్ని కోల్పోవటమే కాక పూర్తిగా నిరాధారుడయ్యాడు. పొట్టచేతపట్టుకొని హైద్రాబాదు వచ్చి దినదినగండంగా బ్రతుకు వెళ్ళదీస్తున్నాడు.

అటువంటి రవి జీవితంలోకి మంజుల అనే ధనవంతుల బిడ్డ ప్రవేశించింది. రవిలో నిద్రాణమై యున్న కవితావేశాన్ని రగిల్చింది. అతనిచేత తిరిగి కలం పట్టించింది. ఆ ఆవేశంతో కావ్యాలకు కావ్యాలనే సృష్టించాడు. పదుగురి చేత మహాకవిగా కీర్తించబడ్డాడు.

నగ కొనుక్కోవటం కోసం బజారు వెళ్ళిన మంజుల తిరిగిరాలేదు. రవి ఆమె కోసం గాలించని చోటులేదు. తిరిగి అతని జీవితంలో స్తబ్దత ఏర్పడింది. ఆ జ్ఞాపకాలను మరచి పోవటానికై రవి తాగుడుకు అలవాటు పడ్డాడు.

పురుషోత్తమ రావు కోటీశ్వరుడు. పెద్ద ఫ్యాక్టరీకి యజమాని. ఆయన పెద్ద మనుమరాలు మంజుల. ఆ ఫ్యాక్టరీలో కూలిగా ప్రవేశించి తన శక్తి సామర్థ్యాలతో యజమానిని మెప్పించి ఆ ఫ్యాక్టరీకే జనరల్

మానేజరు అయ్యాడు మూర్తి. పురుషోత్తమరావు మరణిస్తూ అన్ని బాధ్యతలనూ మంజులకు అప్పగించి వెళ్ళిపోయాడు.

త్రాగుడుకు అలవాటుపడిన రవి రోజు రోజుకీ దిగజారిపోయాడు. ఆ మైకంలో ఒకనాడు ముంతాజ్ అనే ఆమె యింటికి వెళ్లాడు. ఆడి, పాడి, మెప్పించి పొట్టపోసుకుంటున్న మనిషి ముంతాజ్. ఆమె గానానికి ముగ్ధుడైవచ్చిన రవికి ఆమె ఎవ్వరో తెలియదు. కాని ఆ వచ్చినది తన పెద్ద తమ్ముడే అని తెలుసుకున్న ముంతాజ్ దుఃఖంతో సుళ్ళు తిరుగు పోయింది.

మూర్తితో పెళ్ళయిన మంజుల మూర్తి లోగడ చేసిన పాపకార్యాన్ని భరించలేక ఆ పాపకార్యానికి నిష్కృతి తీసుకురావటానికి తన జీవితాన్నే పణంగా పెట్టింది.

మూర్తి చేసిన పాప కార్యం ఏమిటి ?

మంజుల దానికి చూపిన నిష్కృతి ఏమిటి ?

రవి తన అక్కను గుర్తించగలిగాడా ?

స్త్రీకి మనసు ప్రధానమే. మాంగల్యమూ ప్రధానమే.

అయితే దేని ప్రాధాన్యమెంత ?

చిత్ర విచిత్రమైన యీ సమస్యలకు పరిష్కారం వెండితెరమీదే !

పాట నెం. 1

రచన : పాడినవారు :
ఆచార్య ఆత్రేయ బాలసుబ్రహ్మణ్యం, జానకి.

ఆతడు: పో పో పో ఎంతదూరం పోతావో
పోయి పోయి చూడు నువ్వెక్కడ వుంటావో
నా పక్కనె వుంటావు

ఆమె : రా రా రా ఎంతదూరం వస్తావో
వచ్చి వచ్చిచూడు నన్నందుకుంటావో
నా సొంతమవుతావో

ఆతడు : మరునీ విల్లునుండి అమ్ములాగ
బెదరీ తుళ్ళిపడే లేడిలాగ
పరుగుతీసేవు.... పారిపొయ్యేవు
పరువమే నీదని గర్వమా
నిన్ను పట్టుకోలేననీ పందెమా....

ఆమె : మరుపేరాని తీపి తలపులాగ
అలుపేలేని కోడెవలపులాగ
ఉరకలు వేసేవు.... తరుముకు వచ్చేవు
మగసిరీనీదని గర్వమా
నన్ను గెలుచుకోవలెననీ పంతమా ॥రారారా॥

ఆతడు : వయసు వెంటబడే సొగసునీవు
ఆమె : మనసు కోరుకునే మమతనీవు
ఆతడు : రెండూ కలవాలి
ఆమె : రెండూ గెలవాలి
ఆతడు : మనసులో సొగసులే తెలియాలి
ఆమె : తీపి మమతలో వయసునే మరవాలి ॥రారారా॥

పాట నెం. 2

రచన : పాడినవారు :
దాశరథి ఘంటసాల, సుశీల.

ఆతడు : ఏ శుభ సమయంలో
యీ కవి హృదయంలో
నీ కాలి అందెలు మ్రోగినవో
యెన్నెన్ని ఆశలు పొంగినవో

ఆమె : ఏ శుభ సమయంలో
ఈ చెలి హృదయంలో

నీ ప్రేమగీతం పలికిందో
యెన్నెన్ని మమతలు చిలికిందో

ఆతడు : కలలో నీవే ఊర్వశివే
ఇలలో నీవే ప్రేయసివే

ఆమె : నీడయే లేని నాకోసం
తోడై వున్న దేవుడవే

ఆతడు : చిక్కని చీకటిలోన
అతి చక్కని జాబిలి నీవే

ఆమె : మనిషై నన్ను దాచావు
కవివై మనసు దోచావు.

ఆతడు : నిన్నే గెలుచుకొన్నాను
నన్నే తెలుసు కున్నాను

ఆమె : పందిరి నోచని లతకు
నవ నందన మైతివి నీవే

ఆతడు : నీలో విరిసె హారివిల్లు
నాలో కురిసె విరిజల్లు

ఆమె : కనులే కాంచె స్వప్నాలు
నిజమై తోచె స్వర్గాలు

ఆతడు : నవ్వుల పూయలలోనీ
నా యవ్వన శోభవు నీవే

పాట నెం. 3

రచన : పాడినవారు :
ఆచార్య ఆత్రేయ ఘంటసాల, సుశీల

నన్నని వెన్నెల జలతారువలె
కన్నుల కమ్మెను కన్నీటి తెర
ఆ తెరలో ఈ రాతిరిలో
నిన్ను నేను చూస్తున్నా - నీలో
నన్ను నేను చూస్తున్నా
ఇద్దరిలో జగతిలోన
ప్రేమకొరకు వేగిపోవు
వేనవేల హృదయాలే
చూస్తున్నా ॥నిన్నునేను॥

కదలీ కదలక కదలే నీ కదలికలో
చిరుగాలికి ఊగాడే వరిమడినే చూస్తున్నా
ఆ వరిమడిలో ఆ పరవడిలో
వంగి వంగి కలుపుతీయు – కాపుకన్నె
వంపులన్ని
చూస్తున్నా ॥నిన్ను నేను॥
విరిసీ విరియని విరివంటి పరువంలో
కెరటాల గోదారి పురకలనే కంటున్నా
ఆ పురకలలో ఆ నురుగులలో
గడవేస్తూ పడవనడుపు పల్లెపడుచు
పకపకలే
వింటున్నా ॥నిన్ను నేను॥
చిదుమని చెక్కిలి చిందే సిగ్గుల్లో
సందెవేళ అలుముకునే ఎర్రజీర చూస్తున్నా
ఆ ఎర్రదనంలో ఆ కుర్రతనంలో
వెనక జన్మలెన్నెన్నో పెనవేసిన
వెచ్చదనం
కంటున్నా ॥నిన్ను నేను॥

పాట నెం. 4

రచన : పాడినవారు :
ఆచార్య ఆత్రేయ ఘంటసాల

ఎందుకు వచ్చావో
ఎందుకు వెళ్ళావో
నాకేమో తెలియదు
నీకైనా తెలుసునా
తొలికోడి కూతల్లే వినిపించి
తొలిపొద్దు వెలుగల్లే కనిపించి
తొలిజన్మ రుణమేదో అనిపించి
తెరవని తలుపులు తెరిపించి
వచ్చింది ఎందుకో తెలిసుంటె వెళ్ళవు
వెళ్ళేది తెలిసుంటే అసలొచ్చి వుండవు
తెలియక వచ్చింది తెగిపోని బంధం

తెలిసీ నువ్ చేసింది తీయని గాయం
ఇల్లు వదలి వెళ్ళినదానవు - నా
కళ్ళే యిల్లుగ వున్నావెందుకు ?
కన్నీటనైనా కరగిపోరాదా
నన్నొంటిగ నా బాధపడనీరాదా

పాట నెం. 5

రచన : దాశరథి

పాడినవారు : ఘంటసాల

ఆవేశం రావాలి
ఆవేదన కావాలి
గుండెలోని గాయాలు
మండించే గేయాలు
వేదనలై శోధనలై
రగలాలి విప్లవాలు ॥ఆ॥

నరజాతిని భవితవ్యానికి
నడిపేదే ఆవేశం
పదిమందికి భవితవ్యాన్ని
పంచేదే ఆవేదన
వేగంతో వేడిమితో
సాగేదే జీవితం ॥ఆ॥

రణదాహం ధనమోహం
కాలి కూలిపోవాలి
సమవాదం నవనాదం
ప్రతియింటా పలకాలి
ప్రతి మనిషి క్రాంతి కొరకు
రుద్రమూర్తి కావాలి ॥ఆ॥

తరతరాల దోపిడీల
ఉర్రితాళ్ళను తెగతెంచీ
నరనరాల అగ్నిధార
ఉప్పెనలా ఉరికించీ
మరో క్రొత్త ప్రపంచాన్ని
మనిషి గెలుచుకోవాలి ॥ఆ॥

నిదురించిన నా కవితను
కదలించిన ఆవేశం
మరుగుపడిన నా మమతకు
చెరవిప్పిన ఆవేదన
కన్నుగప్పి వెళ్ళింది ।
నన్ను మరచిపోయింది ॥

పాట నెం. 6

రచన : పాడినవారు:
ఆచార్య ఆత్రేయ సుశీల

ఈ ముసుగు తీయకు
నా మోము చూడకు
మరుగు పడిన పాత కథలు
తిరగ తోడకు....గురుతు చేయకు ॥ము॥
జీవితము పూలబాటకాదు
చిరుచేదు లేక తీపి తెలియదు-వహ్వా-వహ్వా
కళ్ళల్లో కళ్ళు కలిపి చూడకు
కన్నీటి తెరల వెనుక వెళ్లి వెతకకు
కనిపించు నీకు కలల బూడి కుప్పలు
మనిషిమీద మనిషి దూయు కత్తులు ॥ము॥
మానవుడు దానవుడై చెలరేగినప్పుడు
తానెక్కడో తలదాచుకుంటాడు దేవుడు-
అవును, అవును-
మధువుకన్న కైపు మమతలోన వున్నది
మన బ్రతుకులన్ని దాని చుట్టె తిరుగుతున్నవి
అందరం పంచుకున్న నెత్తురొక్కటే
ఆఖరికి కలుసుకునే చోటు వొక్కటే ॥ము॥

పాట నెం. 7

రచన : పాడినవారు
అప్పలాచార్య పిఠాపురం - స్వర్ణలత

అతడు : ఎలా ఉన్నదీ - ఇపుడెలా వున్నదీ - ఈ
ఇనుప ముక్క చలువలోని విలువ గొప్పదీ
మహిమ గొప్పదీ ॥ఎలా॥

ఆమె : భలే వున్నదీ - బల్ బలే వున్నదీ - నా
మూర్ఛపోయి మదన జ్వరం తగులు తున్నదీ
రగులు తున్నదీ ॥భలే॥

అతడు : తామరాకు తేనా ? చందనమే పూయనా
చందురినీ తిట్టుదునా ? చపలలోచనా

ఆమె : ప్రతీ దినం యిదే సోదా ? అర్థముకాదా ?
మాటలతో చంపుతావు ? మనసు తెలియదా ?

అతడు : నీ మనసు తెలుసుకున్నా
నా నోరు నొక్కుకున్నా
రచన మానుకున్నా
నీ సేవ చేయుచున్నా
జో జో బాలా ఎందుకే గోలా

ఆమె : దిండు తీసి కొడతా
నూతిలోన పడతా
తల్లినయే యోగమింక
నాకు లేదులే

అతడు : సరే మరీ సరాసరీ తీర్థముపోనా
స్వాములతో సంప్రదించి తావితుతేనా

ఆమె : సోఫాలు పులకరించె
దీపాలు పలవరించె
మనిషివైన నీలో
చలనమింక లేదా
లే రా రా రా
కౌగలించుకోరా ॥ఎలా॥

ఆమె : ఎలావున్నదీ ఇపుడెలా వున్నదీ
ఇల్లాలి వలపు హాయిలోని
విలువ గొప్పదీ - మహిమ గొప్పదీ

అతడు : భలేవున్నదీ. భల్ బలే వున్నదీ
ఇన్నాళ్ళులేని సుఖమునేడు
తెలియుచున్నది - ఓహో తెలియుచున్నది

ఇద్దరు : అహ అహ లల్లా లల్లా....

నటీనటులు :

రవి	....	ఏ. నాగేశ్వరరావు
మంజుల	....	జమున
మూర్తి	....	జగ్గయ్య
ముంతాజ్	....	అంజలి
పెరుమాళ్ళయ్య	....	రమణారెడ్డి
ఆండాళ్ళమ్మ	....	సూర్యకాంతం
కుశశ్రీ	....	పద్మనాభం
గీత	....	గీతాంజలి
శేఖర్	....	రామకృష్ణ
మధు	....	చంద్రమోహన్
పురుషోత్తమరావు	....	వి. నాగయ్య
అమృత	....	మణిమాల
సరళ	....	అనిత

వెల : 10 పైసలు.

—శ్రీ ఫిలిమ్స్ రిలీజ్

సాంకేతిక నిపుణులు :

కథ	:	కె. శ్రీనివాసరావు
మాటలు	:	ఆచార్య ఆత్రేయ
పాటలు	:	ఆచార్య ఆత్రేయ, దాశరథి, అప్పలాచార్య.
ప్లేబాక్	:	ఘంటసాల, సుశీల, బాలసుబ్రహ్మణ్యం, పిఠాపురం, జానకి స్వర్ణలత.
మ్యూజిక్	:	పెండ్యాల నాగేశ్వరరావు
కళ	:	జి. వి సుబ్బారావు
కెమేరా	:	కే. ఎస్. రామకృష్ణరావు
ఎడిటర్	:	పి. శ్రీహరిరావు
మేకప్	:	చౌదరి
స్టూడియోస్	:	శ్రీ సారథీస్టూడియోస్ (పి) లిమిటెడ్
పాటల రికార్డింగ్	}	విజయాగార్డెన్స్, వాహినీ, జెమినీ, ఏ.వి.ఎం.
రీ రికార్డింగ్	:	విజయాగార్డెన్స్
దర్శకత్వం	:	కే. ప్రత్యగాత్మ
నిర్మాత	:	కోగంటి కుటుంబరావు

స్వతంత్ర ఆర్టు ప్రింటర్సు, విజయవాడ-4.